# సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025






**పాటపాడే అక్కాచెల్లెళ్లు ఉయ్యాలో..**

బతుకమ్మ పాటల తరం.. స్వరం మారుతోంది. అక్షరం ముక్క రాకపోయినా వినడం ద్వారా పొడువని పాటలెన్నో ముందు తరానికి అందిస్తున్న వారెందరో ఉన్నారు. 10లో▸

## న్యూస్‌రీల్

### గూడెం ఆలయ హుండీలు లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయ హుండీల డబ్బులు గురువారం లెక్కించినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. జూన్ 12 నుంచి సెప్టెంబర్ 24 వరకు మధ్యకాలం హుండీ డబ్బులు లెక్కించగా రూ.6,31,841 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. దేవదాయ శాఖ పర్యవేక్షకులు రవి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ లెక్కింపులో ఆలయ ముఖ్య అర్చకులు రఘుస్వామి, అర్చకులు, సిబ్బంది, సత్యనారాయణస్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా కలవేన శంకర్



మహాసభల్లో కలవేన శంకర్

పాతమంచిర్యాల: సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా కలవేన శంకర్ ఎన్నికయ్యారు. ఈ నెల 21 నుంచి 25వరకు ఛండీఘడ్‌లో పార్టీ 25వ జాతీయ మహాసభలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా కొనసాగుతున్న ఆయనను మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ నుంచి మొదలుకొని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌లో కార్మికులు, కార్మికేతరులు, ప్రతీ ఇంటికి నీటి వసతి, శ్రీరాంపూర్‌లో కార్మికులకు సింగరేణి సంస్థ ఉచిత విద్యుత్ తదితర అంశాలపై పోరాటం చేశారు. శంకర్‌ను పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అభినందించారు.

### కుటుంబ విలువల పరిరక్షణకు నడుం బిగించాలి



మాట్లాడుతున్న జిల్లా ఆర్ఎస్ఎస్ ప్రధాన వక్త రూపాచారి

భీమారం: కుటుంబ విలువల పరిరక్షణకు ప్రతీ హిందువు నడుం బిగించాలని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రధాన వక్త ఉప్పల రూపాచారి అన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ వందేళ్లుగా రాజ్యాంగబద్ధంగా దేశ అభ్యున్నతి కోసం పనిచేస్తోందని తెలిపారు. ఆర్ఎస్ఎస్ జన్మశతాబ్దిలో భాగంగా రాబోయే రోజుల్లో ఇంటింటి జన జాగరణ చేపట్టబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రముఖ్ కొ్ట్రంగి రవీందర్, మాదాడి శ్రీధర్‌రెడ్డి, మెండె మల్లేశ్ పాల్గొన్నారు.

### 'జీఎస్టీ సంస్కరణలతో పేదలకు లబ్ధి'



రఘునాథ్‌ను గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూర్: పేద, మధ్య తగరతి ప్రజలకు లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జీఎస్టీ సంస్కరణలకు శ్రీకారం చుట్టారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఉపాధ్యక్షుడి హోదాలో మొదటిసారిగా చెన్నూర్‌కు వచ్చిన ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో చెన్నూర్, కోటపల్లి నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక మహేశ్వరీ భవన్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో రఘునాథ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విడుదల చేస్తున్న నిధుల వివరాలు ప్రజలకు వివరించాలని అన్నారు. అనంతరం పట్టణంలోని గాంధీ చౌక్‌లో కొత్త జీఎస్టీ అమలు తీరుపై దుకాణాల్లో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి దుర్గం అశోక్, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్, పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, ముఖేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు కొలిక్కి..!

- ఆయా కేటగిరీల వారీగా ఖరారు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనే తరువాయి
- పోటీ చేసే అవకాశాలపై ఆశావహుల ఆరా
- లీకులతో నాయకుల్లో ఉత్కంఠ



జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు కావడంతో స్థానిక నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. పోటీకి రిజర్వేషన్ అనుకూలతపై లెక్కలు వేసుకుంటున్నారు. ఇప్పటికే ఆయా స్థానాలకు ఏ రిజర్వేషన్ ఖరారైందో తెలుసుకుంటూ పోటీకి సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే వరకు జిల్లా అధికారులు వివరాలు వెల్లడించే అవకాశం లేదు. అయితే ఏ స్థానం ఏ వర్గాలకు కేటాయింపు జరిగిందోనని ఆతృతతో నాయకులు తమకు తెలిసిన వారితో ఆరా తీస్తున్నారు. మొదట అధికారులు 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఖరారు చేశారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జనాభా గణాంకాలను సైతం పరిగణనలోకి తీసుకుని ఎస్సీ, ఎస్టీతోపాటు బీసీ, జనరల్ స్థానాలకు రిజర్వేషన్ల ఖరారు పూర్తి చేశారు.

**రాష్ట్రం, జిల్లా, గ్రామం యూనిట్లుగా..**

రాష్ట్రం యూనిట్‌గా జెడ్పీ చైర్‌పర్సన్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారవుతాయి. అంటే రాష్ట్రంలోని 31 జిల్లా పరిషత్‌లు వర్గాల వారీగా జిల్లాకు ఆయా రిజర్వేషన్ అమలవుతుంది. ఇక జిల్లా యూనిట్‌గా జెడ్పీటీసీ, మండలం యూనిట్‌గా ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, గ్రామం యూనిట్‌గా వార్డుల వారీగా రిజర్వేషన్లు ఖరారయ్యాయి. గతంలో స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్ పరిమితం ఎత్తేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 70శాతానికి పెంచింది. ఈ క్రమంలో 42శాతం బీసీలు, ఎస్సీ 18శాతం, ఎస్టీ 10శాతం అమలు చేయనున్నారు. ఇక మొత్తం స్థానాల్లో కచ్చితంగా మహిళలకు 50శాతం కేటాయిస్తారు. అంటే 8 జెడ్పీటీసీ, 65 ఎంపీటీసీ, 153 సర్పంచ్, 1340 వార్డు స్థానాలు మహిళలకు రిజర్వు అవుతాయి. ఈ ఎన్నికల నుంచే బీసీలకు 42శాతం అమలు నేపథ్యంలో ఆయా సామాజిక వర్గాలకు గతంలో కంటే రాజకీయంగా అవకాశాలు మెరుగుపడనున్నాయి.

**కేటగిరీల వారీగా చూస్తే..**

జిల్లాలో 16 జెడ్పీటీసీ స్థానాల్లో ఆరు బీసీలకు, 3 ఎస్సీలకు, ఒకటి ఎస్టీ, మిగతా ఆరు స్థానాలు జనరల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ఇక ఎంపీపీ స్థానాలు ఇదే తీరుగా ఉండనుండగా, ఎంపీటీసీలు బీసీలకు 54, ఎస్సీలకు 23, ఎస్టీలకు 12, జనరల్‌కు 40స్థానాలు దక్కనున్నాయి. అలాగే సర్పంచ్ స్థానాల్లో 128స్థానాలు బీసీలకు, 55స్థానాలు ఎస్సీలకు, 30స్థానాలు ఎస్టీలకు, 93స్థానాలు జనరల్ కేటగిరీలకు అవకాశం రానుంది. అలాగే 1125వార్డులు బీసీలకు, 482 ఎస్సీలకు, 268 ఎస్టీలకు, 805 స్థానాలు జనరల్‌కు రిజర్వు అయ్యే అవకాశం ఉంది.

| జిల్లాలో స్థానిక సంస్థలు | | |
|---|---|---|
| జెడ్పీటీసీలు 16 | ఎంపీపీలు 16 | ఎంపీటీసీలు 129 |
| గ్రామ పంచాయతీలు 306 | వార్డులు 2,680 | |

### లీకులతో నాయకుల్లో ఆందోళన

జిల్లా స్థానిక సంస్థలకు రిజర్వేషన్ల ఖరారు కావడంతో సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఆయా మండలాలు, గ్రామాలకు కేటగిరీల వారీగా రిజర్వేషన్లు అయినట్లు మెసేజ్‌లు, పోస్టులు పెడుతున్నారు. దీంతో తమ గ్రామం, మండలంలో ఆయా వర్గాలకు అవకాశం వచ్చిందా? అన్నట్లుగా ఆరా తీస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఎక్కడా అధికారికంగా వెల్లడికాలేదు. కానీ ఉత్కంఠ ఆగలేక రెవెన్యూ, పంచాయతీ, స్థానిక అధికారులతో తెలుసుకుంటున్నారు. కొంతమంది అధికారులు నాయకులకు సన్నిహితంగా ఉన్న వారితో రిజర్వేషన్ల సమాచారం బయటకు లీకులు ఇస్తున్నారు. దీంతో గ్రామాల్లోని వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతున్నాయి. అయితే తమ వర్గాలకు రిజర్వేషన్ రాకపోయేసరికి కొందరు నిరాశపడుతున్నారు.

# ఎడతెరిపిలేని వర్షం



గేట్లు ఎత్తడంతో గోదావరిలో కలుస్తున్న నీరు

- జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ
- వణికిస్తున్న చలిగాలులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయం వరకు 25మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షంతోపాటు చల్లని ఈదురుగాలులు వీస్తున్నాయి. పత్తి పంట పూత, కాతకు రాగా వర్షం, గాలులతో నేలరాలిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో పత్తి, వరి పంటల్లోకి వరద నీరు చేరి మునిగిపోతోంది. సింగరేణి ఓపెన్‌కాస్టుల్లోకి వరద నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు విపరీతమైన చల్లని ఈదురుగాలులు వీస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులు వణికిపోతున్నారు. శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో మరో మూడు రోజులపాటు జిల్లాలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

**వర్షపాతం**

గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మండలాల్లో వర్షం కురిసింది. జన్నారం మండలంలో 30.3 మిల్లీమీటర్లు, దండేపల్లిలో 27.3, లక్సెట్టిపేటలో 20.5, జైపూర్‌లో 19, కాసిపేటలో 18, చెన్నూర్‌లో 16.3, కన్నెపల్లిలో 15.8, బెల్లంపల్లిలో 15, తాండూర్‌లో 15, కోటపల్లిలో 15, భీమారంలో 14.8, నెన్నెలలో 13.3 భీమినిలో 11.8, నస్పూర్‌లో 10.3, వేమనపల్లిలో 9, హాజీపూర్‌లో 8, మంచిర్యాలలో 7.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

**'ఎల్లంపల్లి'కి భారీగా వరద**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు భారీగా వరద నీరు వస్తోంది. గురువారం రాత్రి వరకు ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలకు గాను 15.800 టీఎంసీలతో ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 2.70 లక్షల క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 3.50 లక్షలు, కడెం నుంచి 5 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 288 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, 40 గేట్లు ఎత్తడంతో 6.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు గోదావరిలో కలుస్తోంది.

# మద్యం టెండర్లకు వేళాయె

- దరఖాస్తు రుసుం రూ.3లక్షలు
- లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు
- నేటి నుంచి అక్టోబర్ 18వరకు దరఖాస్తుల స్వీకరణ



డ్రా తీస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలక్రైం: జిల్లాలో కొత్తం మద్యం పాలసీ టెండర్లకు వేళయింది. 2025–27 సంవత్సరాల నిర్వహణకు గాను ఈ నెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా ఎక్సైజ్ అధికారి కేజీ నందగోపాల్ సమక్షంలో గురువారం సాయంత్రం రిజర్వేషన్లను డ్రా పద్ధతిలో ఖరారు చేశారు. జిల్లాలో 73 దుకాణాలు ఉండగా.. కలెక్టరేట్‌లోని జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుల ధరావత్(ఈఎండీ) రూ.3లక్షలు చలానా లేదా డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుసుం తిరిగి చెల్లించరు. ఒక్కరు ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. డ్రాలో ఎన్ని దుకాణాలు వచ్చినా అర్హులే అవుతారు. దరఖాస్తుతో మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, సంతకం చేసిన పాన్, ఆధార్ కాపీలు, గౌడ్, ఎస్సీ, ఎస్టీలు కుల ధ్రువీకరణ పత్రాలు, ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ధ్రువీకరణ సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుల పక్రియ పూర్తయిన తర్వాత వచ్చే నెల 23న కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో జిల్లాలోని వైన్ షాపులు కేటాయిస్తారు. ఎంపికైన లబ్ధిదారులు డిసెంబర్ ఒకటి నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభానికి ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుందని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన మందమర్రి మున్సిపాలిటీలో ఆరు మద్యం దుకాణాలను డ్రా పద్ధతిలో కాకుండా ఎస్టీలకే కేటాయించారు.

**జిల్లాలో రిజర్వ్ చేసిన ఏ4 మద్యం దుకణాలు**

| రిజర్వేషన్ | దుకాణాలు | దుకాణం నంబర్లు |
|---|---|---|
| ఎస్సీ | 10 | 11, 22, 26, 36, 42, 45, 61, 64, 65, 67 |
| ఎస్టీ | 06 | 68, 69, 70, 71,72,73 |
| గౌడ్స్ | 06 | 9, 13, 29, 31, 37, 59 |
| జనరల్ | 51 | |

# నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ అంబర్‌కిశోర్‌ఝా

బెల్లంపల్లి: నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి శాంతిభద్రతలు పరిరక్షించాలని రామగుండం పోలీసు కమిషనర్(సీపీ) అంబర్‌కిశోర్ ఝా అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం బెల్లంపల్లి టూటౌన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిధిలో నేరాలు, నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీపీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేరాలకు పాల్పడే వారిని గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని అన్నారు. ఎస్సై చిలుముల కిరణ్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఎగ్గడి భాస్కర్, ఏసీపీ ఏ.రవికుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ పాల్గొన్నారు.

# 'పది'కి ప్రత్యేక సన్నద్ధత

- దసరా సెలవుల తర్వాత అభ్యాస దీపికల పంపిణీ
- శతశాతం ఫలితాలకు విద్యాశాఖ కార్యాచరణ



బుక్‌డిపోలో అభ్యాసదీపికలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాల పెంపుతోపాటు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటుగా రాణించేలా అక్టోబర్ నుంచి ప్రత్యేక తరగతుల నిర్వహణకు చర్యలు చేపట్టింది. దసరా, బతుకమ్మ పండుగ సెలవుల తర్వాత ప్రత్యేక తరగతులు ప్రారంభం కానున్నాయి. గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో 17వ స్థానంలో నిలిచింది. 96.54 ఉత్తీర్ణత శాతం పెరగడం కాస్త ఊరటనిచ్చింది. 2025–26 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. వచ్చే ఏడాది జనవరి 10 నాటికి సిలబస్ పూర్తి చేయాలని నిర్ణయించారు. సెలవులు ముగియగానే ప్రత్యేక తరగతులతోపాటు సత్ఫలితాలకు అభ్యాస దీపికల పంపిణీకి సిద్ధమవుతున్నారు.

**తరగతుల కార్యాచరణ..**

జిల్లాలోని 131 ప్రభుత్వ పాఠశాలల్లో 4,567 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. అక్టోబర్ నుంచి ప్రతీ రోజు ఉదయం లేదా సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ప్రత్యేక తరగతి రోజులోని అంశానికి సంబంధించిన భావనలను 20నిమిషాల వివరణతో ప్రారంభిస్తారు. 40నిమిషాల గైడెడ్ ప్రాక్టీస్, అప్లికేషన్ ఉండనున్నాయి. విద్యార్థులు పాఠాలు చదవడం, ప్రశ్నలకు స్వయంగా సమాధానం ఇవ్వడానికి ప్రోత్సహించాల్సి ఉంటుంది. విద్యార్థుల చేతిరాత, స్పష్టత, సమాధానాల ప్రదర్శనను మెరుగుపర్చడానికి ప్రాధాన్యత ఇస్తారు. మెలకువలు, గణిత ప్రక్రియ నేర్చుకోవడంపై నిత్యసాధన, సైన్స్ రేఖాచిత్రాలు, ప్రయోగాలు, సామాజిక అధ్యయనాలు, మ్యాప్ పాయింటింగ్, గ్రహణం, ఉపన్యాసాలపై విద్యార్థులు దృష్టి సారించనున్నారు. విద్యార్థులు సబ్జెక్టు అవగాహన కోసం యూట్యూబ్‌లో టీసాట్ పరీక్ష తయారీ వీడియోలు వీక్షించేలా ప్రోత్సహిస్తారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. విద్యార్థుల షెడ్యూల్, పురోగతి, మెరుగుదల అవసరమైన విషయాలపై చర్చించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించడం, పరీక్ష సంబంధిత ఒత్తిడిని అధిగమించడానికి కౌన్సెలింగ్ సెషన్ల నిర్వహణకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది.

**సత్ఫలితాలకు అభ్యాస దీపిక..**

పదో తరగతిలో సత్ఫలితాలకు అవసరమైన పుస్తకాలు ముద్రించారు. రాష్ట్ర విద్యాపరిశోధన, అభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిపుణులతో ముద్రించిన అభ్యాస దీపికలు మంచిర్యాల బుక్‌డిపోకు చేరాయి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో ఉన్నాయి. ప్రతీ విద్యార్థికి గణితం, సాఘికం, జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించిన నాలుగు అభ్యాస దీపికలు ఇస్తారు. లఘు, వ్యాసరూప, బహుళైచ్చిక ప్రశ్న జవాబులతో ముద్రించారు. ప్రీఫైనల్ అయ్యే వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు.

**బుక్‌డిపోకు చేరిన అభ్యాసదీపికలు**

| సబ్జెక్టు | తెలుగు మీడియం | ఇంగ్లిష్ మీడియం | ఉర్దూ | మొత్తం |
|---|---|---|---|---|
| సోషల్ | 1132 | 4123 | 29 | 5284 |
| గణితం | 1132 | 4128 | 29 | 5289 |
| ఫిజిక్స్ | 1132 | 4223 | 29 | 5284 |
| బయోలజీ | 1100 | 4123 | 29 | 5752 |
| | | | | 21,109 |

### సెలవుల తర్వాత పంపిణీ



పండుగల సెలవుల తర్వాత ప్రత్యేక తరగతులతోపాటు అభ్యాస దీపికలు పంపిణీ చేస్తాం. సులభంగా అర్థమయ్యేలా పొందుపర్చారు. రెండు పూటల తరగతులు కొనసాగిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తాం. ఆయా విషయాల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించడం, ప్రత్యేక శ్రద్ధ చూపడంతోపాటు శతశాతం ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం.

–ఎస్.యాదయ్య, డీఈవో, మంచిర్యాల

# పేదరికాన్ని జయించి.. గ్రూప్‌–1 విజేతగా..

- సీటీవోగా ఉద్యోగం సాధించిన సత్యనారాయణమూర్తి
- యువతకు ఆదర్శం



తల్లిదండ్రులతో సత్యనారాయణమూర్తి

బెల్లంపల్లి: తల్లిదండ్రుల రెక్కల కష్టం తప్ప మరే ఆధారం లేని కుటుంబం.. అయినా ఆ యువకుడు నిరూత్సాహ పడలేదు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని, చదువుకు పేదరికం అడ్డు కాదని బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామానికి చెందిన కొత్తూరు సత్యనారాయణ మూర్తి భావించాడు. పట్టుదలతో చదివి బుధవారం వెలువడిన టీజీపీఎస్సీ గ్రూప్‌–1 ఫలితాల్లో 280వ ర్యాంకుతో కమర్షియల్ టాక్స్ ఆఫీసర్(సీటీవో)గా ఉద్యోగం సాధించాడు.

**శిక్షణ తీసుకోకుండానే..**

సత్యనారాయణమూర్తి పదో తరగతి సెయింట్ మెరీస్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ ప్రగతి జూనియర్ కళాశాలలో, డిగ్రీ హైదరాబాద్‌లోని ఏవీ కళాశాలలో పూర్తి చేశాడు. ప్రస్తుతం కేవీ రంగారెడ్డి లా కాలేజీలో ఎల్ఎల్‌బీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన మేనమామ మోకెనపల్లి శ్రీనివాస్ ప్రేరణతో డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే రోజుకు ఏడు గంటలు చదువుతూ సివిల్స్‌కు సన్నద్ధమయ్యాడు. డిగ్రీ ఫైనలియర్‌లో ఉండగానే సివిల్ సర్వీస్ పరీక్ష రాశాడు. అందులో ఫెయిల్ కావడంతో పరీక్షపై అవగాహన పెంచుకున్నాడు. రెండోసారి ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించినా మెయిన్స్‌లో తప్పాడు. అయినా నిరాశ చెందకుండా మూడోసారి ప్రిలిమ్స్ ఉత్తీర్ణుడై మెయిన్స్ పరీక్ష రాశాడు. ఫలితాల కోసం ఎదురు చూస్తున్న క్రమంలో టీజీపీఎస్సీ గ్రూప్‌–1 నోటిఫికేషన్ జారీ అయింది. పరీక్ష రాసిన మూర్తి సీటీవో అయ్యాడు.

**కొడుకు చదువు కోసం..**


కొత్తూరు లక్ష్మి, శ్రీనివాస్ దంపతులకు ఏకైక సంతానం సత్యనారాయణమూర్తి. తండ్రి ప్రైవేటు ప్లంబర్‌గా పని చేస్తుండగా..తల్లి గృహిణి. శ్రీనివాస్ కొంతకాలం బెల్లంపల్లి మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా ప్లంబర్ పనులు చేశాడు. కొడుకును ఉన్నతంగా చదివించాలనే లక్ష్యంతో కొన్నాళ్ల క్రితం ఆ దంపతులు స్వగ్రామాన్ని వీడి కొడుకుతోపాటు హైదరాబాద్‌కు వెళ్లారు.

### ఐఏఎస్ కావడం జీవితాశయం

నా చిన్నతనం నుంచి పేదరికాన్ని చవిచూశాను. నా చదువు కోసం అమ్మనాన్న పడిన కష్టాలు గమనించాను. గొప్పగా చదువుకుంటే ఉన్నతమైన ఉద్యోగం సాధించవచ్చని నా మేనమామ చెప్పిన మాటలు ఇంకా నాకు గుర్తు ఉన్నాయి. అందుకనే చిన్నతనం నుంచే ఐఏఎస్ కావాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాను. ఆ లక్ష్యసాధనలో ఒక్కో మెట్టు ఎక్కుతున్న క్రమంలో అనూహ్యంగా గ్రూప్‌–1 ఉద్యోగం వచ్చింది. అయినా సరే సివిల్స్ పరీక్ష పాసై కలెక్టర్ అవుతాను.

– సత్యనారాయణమూర్తి

### వ్యవసాయ కుటుంబం నుంచి డిప్యూటీ కలెక్టర్‌గా..



తల్లిదండ్రులతో వనజ

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బానవత్ దశరత్, లలిత దంపతుల కుమార్తె బానవత్ వనజ గ్రూప్‌–1లో 504.5 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 38వ ర్యాంకు సాధించింది. డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికైంది. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ కూతురిని చదివించారు. వనజ ఒకటి నుంచి పదో తరగతి వరకు లింగాపూర్, దండేపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో, ఇంటర్ కరీంనగర్ ప్రైవేటు కాలేజీలో, డిగ్రీ కాకతీయ ఓపెన్ యూనివర్సిటీ వరంగల్, పీజీ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చదివింది. ప్రభుత్వ కొలువు సాధించాలనే తపనతో సుమారు నాలుగేళ్లపాటు హైదరాబాద్‌లోని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో యూపీపీఎస్సీకి సన్నద్ధమైంది. ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా గ్రూప్‌–1, 2, 4లో ఉత్తీర్ణత సాధించింది. గ్రూప్‌–4లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. అంతలోనే జూనియర్ లెక్చరర్ ఉద్యోగం రావడంతో అటువైపు వెళ్లింది. బుధవారం గ్రూప్‌–1 ఫలితాలు విడుదల కావడంతో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి ఎంపికైంది. ఉన్నత ఉద్యోగం సాధించినందుకు చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



చెన్నూర్‌లో ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్/చెన్నూర్‌రూరల్/మందమర్రి(రామకృష్ణాపూర్): అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం ఆయన చెన్నూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, అమృత్ ట్యాంకు నిర్మాణం పనులు పరిశీలించారు. చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మాణ పనులు పరిశీలించారు. మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధారి ఖిల్లా మేడిచెరువుకు పడిన గండిని కలెక్టర్ పరిశీలించారు. చెరువు పరిస్థితిపై నీటిపారుదల శాఖ డీఈ శారద, మందమర్రి తహసీల్దార్ సతీష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల వరదలతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, కమిషనర్ మురళీకృష్ణ, ఏఈలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మద్యం బాటిళ్లు ధ్వంసం



ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు

**బోథ్:** గతంలో కౌఠ, ధన్నూర్, మర్లపెల్లి గ్రామాల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను ఎక్సైజ్ సీఐ జుల్ఫీకర్ అహ్మద్, ఎస్సై శ్రీసాయి ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ధ్వంసం చేశారు. వాటి విలువ రూ.2లక్షలు ఉంటుందన్నారు. అక్రమంగా మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఎలుగుబంట్ల దాడిలో రైతులకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు

**నెన్నెల:** మండలంలోని మైలారం గ్రామ శివారులో గురువారం మూడు ఎలుగుబంట్లు దాడి చేయడంతో దుబ్బపల్లి గ్రామానికి చెందిన అర్క మారయ్య, గావిడి మల్లేశ్ అనే గిరిజన రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. సదరు రైతులు మధ్యాహ్నం గ్రామ శివారులోని పత్తి చేన్లకు వెళ్తుండగా మూడు ఎలుగుబంట్లు అకస్మాత్తుగా వచ్చి దాడి చేశాయి. తీవ్రగాయాలు కావడంతో బాధిత కుటుంబ సభ్యులు వెంటనే 108లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యంకోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

**జైపూర్:** మండలంలోని ఇందారం క్రాస్ రోడ్డు సమీపంలో రాజీవ్‌రహదారి పక్కన అటవీప్రాంతంలో మంచిర్యాల పట్టణం హైటెక్‌సిటీ కాలనీకి చెందిన బోయిని శంకర్(35) అలియాస్ రాఘవులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం .. శంకర్ గత ఐదేళ్లుగా కడుపు, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నాడు. కరీంనగర్ ఆస్పత్రిలో వైద్యం చేయించినా నయం కాలేదు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. చేపలు విక్రయిస్తూ జీవించే శంకర్ ఇంట్లో నుంచి వచ్చి రెండు మూడు రోజులు బయట చేపలు విక్రయిస్తూ తిరిగి ఇంటికి వెళ్లేవాడు. ఇదే క్రమంలో గత 23న చేపలు విక్రయించడానికి వెళ్తున్నానని చెప్పి 24న ఇందారం క్రాస్‌రోడ్డు వద్దకు బస్సులో వచ్చి చెట్టుకు ఉరేసుకున్నాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని, అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా సూసైడ్ నోట్ లభించింది. మృతుడి తల్లి బోయిని భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై శ్రీధర్ తెలిపారు.

### సింగరేణి కార్మికుడు ఆత్మహత్య



గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

**మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్):** రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు రెక్కల గోవర్ధన్‌రెడ్డి (39) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆర్కేపీ సీహెచ్‌పీలో జనరల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న గోవర్ధన్‌రెడ్డికి అతని భార్యకు మధ్య బుధవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఓరియంట్ కార్మికులకు బోనస్ పెంపు



అగ్రిమెంట్ పత్రాలతో సత్యపాల్‌రావు

**కాసిపేట:** దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపనీ పర్మినెంట్, లోడింగ్ కార్మికులకు బోనస్ పెంచుతూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. గుర్తింపు సంఘం అధ్యక్షుడు సత్యపాల్‌రావుతో యాజమాన్యం గురువారం నిర్వహించిన చర్చల్లో రూ.4 వేలు పెంచేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. గతంలో రూ.35,500 ఉండగా ప్రస్తుతం రూ.39,500కు పెంచారు. రాబోయే సంవత్సరానికి రూ.2వేలు పెంచుతూ రూ 41,500లకు అగ్రిమెంట్ చేసుకున్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.16,800 ఇస్తుండగా రూ.వెయ్యి పెంచుతూ రూ.17,800 ఇవ్వనున్నట్లు తెలిపారు. చర్చల్లో కంపనీ హెచ్‌ఆర్ హెడ్ ఆనంద్ కులకర్ణి, గుర్తింపు సంఘం సెక్రటరీ భీమిని మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు మెరుగు శంకర్, కాల్వ సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పాటపాడే అక్కాచెల్లెళ్లు ఉయ్యాలో..

బతుకమ్మ అనగానే అందరికీ గుర్తొచ్చేవి.. తీరొక్క పువ్వులు.. బతుకమ్మ పాటలు. ప్రస్తుతం పూలకు ఎంత డిమాండ్ ఉందో.. పాటలకు అంతే ఉంది. అయితే ఒకప్పుడు మహిళలు లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ బతుకు చిత్రాన్ని ఆవిష్కరించే పాటలు పాడేవారు. క్రమంగా ఆ పాటలు కనుమరుగవుతున్నాయి. అయితే ఇప్పటికీ కొందరు పాత పాటలతో ఆకట్టుకుంటున్నారు. ఇక ప్రస్తుత తరం.. జానపద పాటలు, కోలాటాల నృత్యాలతో ఉత్సాహంగా పాలుపంచుకుంటున్నారు. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ వేడుకల్లో పాటలు సద్దుల బతుకమ్మ వరకు ఊరూరా.. వాడవాడలా మార్మోగుతున్నాయి. పూల పండుగలో పాడే పాటల్లో సామాజిక అంశాలు, కుటుంబ బాంధవ్యాలు దాగి ఉన్నాయి. బతుకమ్మ పాటలపై నాటి, నేటి మహిళల అభిప్రాయాలు..



మంచిర్యాల జిల్లా కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



### పెద్దోళ్లు పాడితే విని నేర్చుకున్న



**బెల్లంపల్లి:** నాకు ఇప్పుడు 90 ఏళ్లు. నా చిన్నతనం నుంచి ఊర్లో ఉన్న పెద్దోళ్లు బతుకమ్మ ఆడుతుంటే అక్కడికి వెళ్లి పాటలు వినేదాన్ని. అలా దాదాపు 50కి పైగా బతుకమ్మ, గౌరమ్మ పాటలు నేర్చుకున్నా. నాకు సదువుసుత రాదు. గంటకుపైగా పాడినా వొడువని పాటలను కంఠస్థం చేసి నేర్చుకున్నా. పెద్దయ్యాక బతుకమ్మ ఆడుతుండగా నేనే పాటలు పాడేదాన్ని. అమ్మలక్కలు మా ఇంటికాడికచ్చి పాటలు పాడమని నన్ను అడిగేటోళ్లు. మా ఇంటి ముందు బతుకమ్మను పేర్చి దినాం పాటలు పాడి ఆడేటోళ్లం. నా పాటలను ఊళ్లో ఉన్న మగోళ్లు, ఆడోళ్లు శ్రద్ధగా వినేవాళ్లు. ఆళ్లను చూసి నాకెంతో సంబురం అనిపించేది. – గొట్టిపర్తి పుల్లక్క, తాళ్లగురిజాల

### అప్పటి పాటల తరీకే వేరు



**బెల్లంపల్లి:** నాకు పాటలంటే ఎంతోఇష్టం. నా చిన్నతనంలో ఎంగిలిపూల బతుకమ్మ రోజు పాటలు పాడుడు సురూజేసి సద్దుల బతుకమ్మ దాక దినాం ఆడిపాడెటోళ్లు. పెద్దోళ్లు పాటలు పాడుతుంటే శ్రద్ధగా వినేదాన్ని. అలా 25 పాటల వరకు నేర్చుకున్నా. 80 ఏళ్ల వయస్సు వచ్చినా ఇప్పటికీ నా చిన్నతనంల నేర్చుకున్న పాటలు గుర్తున్నాయి. ఇప్పటికీ ఊళ్లో ఉన్న అమ్మలక్కలు నన్నే పాటలు పాడమని అడుగుతారు. ఇప్పటి పిల్లలకు బతుకమ్మపాటలు తెల్వదు. పాత పాటలు విని నేర్చుకుంటే మంచిది. – దురిశెట్టి చుక్కమ్మ, నెన్నెల

### విని నేర్చుకుంటున్న



**బెల్లంపల్లి:** బతుకమ్మ పాటలంటే నాకెంతో ఇష్టం. పెద్దోళ్లు పాడుతుంటే విని నేర్చుకుంటున్నా. ఒక్కో పాట గంటకుపైగా పాడుతుంటే విని ఆశ్చర్యపోతున్నా. చదువు రానోళ్లు అంత పెద్ద పాటలు ఎట్ల నేర్చుకున్నరో అర్థం కావడం లేదు. ఎట్లైనా సరే బతుకమ్మ పాటలు నేర్చుకోవాలని బట్టీపడుతున్నా. ఇప్పటి వరకు ఏడెనిమిది పాటలు నేర్చుకున్న. నాతోటోళ్లతోని బతుకమ్మ ఆడుతూ నేనే పాటలు పాడుతున్నా. ఇంకా మరెన్నో పాత పాటలు నేర్చుకోవాలనే కోరిక ఉంది. – ముక్కెర అక్షయ, తాళ్లగురిజాల

### పాటలంటే ఇష్టం..



**మంచిర్యాలఅర్బన్:** మాది చెన్నూర్. మాఅమ్మమ్మ ఊరు ఆసిఫాబాద్ జిల్లా కైరిగాం. అప్పట్లో దసరా సెలవులు వచ్చిందంటే అక్కడికి వెళ్లేవాళ్లం. అమ్మమ్మ చదువుకోకపోయినా బతుకమ్మ పాటలు చక్కగా పాడుతుంది. వాళ్ల వల్లే పాటలు నేర్చుకున్నా. బతుకమ్మ పాటలన్నీ కష్టాలు, బాధలు, బంధుత్వాలు, సంతోషం కలగలిపి ఉంటాయి. అందరూ కలిసిమెలిసి సంప్రదాయంగా ఆడుతూ పాడుకునే బతుకమ్మ పండగ అంటే నాకెంతో ఇష్టం. – రంగు సంజన, ఇంటర్ విద్యార్థిని

### అక్క వద్ద నేర్చుకున్నా..



**మంచిర్యాలఅర్బన్:** మా సొంతూరు రెబ్బనపల్లిలో ఏటా బతుకమ్మ వేడుకలు జరుపుకుంటాం. మా అమ్మమ్మ, నానమ్మలు బతుకమ్మ పాటలు పాడుతుంటే పక్కింట్లో ఉండే పెద్దమ్మ కూతురు నేర్చుకుంది. అక్క పాడుతుండగా నేనూ స్వరం కలిపేదాన్ని. ఇప్పుడు అలవోకగా పాడుతా. చాలామంది పట్టణాల్లో నివసించే యువతులకు డీజే సౌండ్ పాటలే తెలుస్తాయి. కాలానికి అనుగుణంగా పాటలు ఎన్ని వస్తున్నా పచ్చి పాల వెన్నెలా..అనే పాట అంటే ఎంతో ఇష్టం. – మ్యాకల అర్చన, ఇంటర్ విద్యార్థిని

### చిన్నప్పుడే నేర్చుకున్నా



**భీమారం:** నా చిన్నతనంలో బతుకమ్మ ఆడుతుండగా అక్కడి వెళ్లి పాటలు విని నేర్చుకున్నా. డీజే పాటలతో పాటు స్వతహాగా పాడే పాటలను తోటి మహిళలు ప్రోత్సహిస్తున్నారు. డీజే సంస్కృతి నుంచి ఇప్పుడిప్పుడే మహిళలు నేర్చుకున్న పాటలు పాడేందుకు మక్కువ చూపుతున్నారు. రానున్న రోజుల్లో డీజే పాటలు పోయి తిరిగి పాత కాలం మాదిరి అందర్నీ ఆకట్టుకునే పాటలుపాడే రోజులు వస్తాయి. – గుడిమల్ల లావణ్య భీమారం

### అమ్మమ్మతో కలిసి పాడేదాన్ని



**కాగజ్‌నగర్‌టౌన్:** చిన్నప్పటి నుంచి బతుకమ్మ పాటలు పాడుతున్నా. మా అమ్మమ్మ, అమ్మతో కలిసి బతుకమ్మ ఆడుతూ పాటలు పాడేదాన్ని. ఇంట్లో ఖాళీ సమయంలో వారివద్ద పాటలు నేర్చుకున్నా. 50 పాటలు పాడుతా. బతుకమ్మ పండగ వచ్చిందంటే చాలు మా ఊర్లో నా పాట లేనిదే బతుకమ్మ ఆడరు. ఇప్పటి పిల్లలు నేర్చుకుంటే బాగుంటుంది. – మంగ పోచుబాయి, భట్టుపల్లి, కాగజ్‌నగర్

### ఇలవేల్పుగా పూజిస్తాం



**మంచిర్యాలఅర్బన్:** మాఇంటి ఇలవేల్పుగా బతుకమ్మను గౌరమ్మగా భావించి పూజిస్తాం. చిన్నప్పుడు అమ్మమ్మ, నానమ్మతో కలిసి పాటలు నేర్చుకున్నా. వ్యవసాయం, ఇతర పనుల్లో అలసట తెలియకుండా ఎప్పుడు ఏదో ఉయ్యాల పాటలు పడేవాళ్లం. కుటుంబం, జీవితంలో జరిగే సంఘటనలు, దేవతామూర్తులను కీర్తిస్తూ లెక్కలెనన్ని పాటలుండేవి. ఒక్కో పాట గంటలతరబడి పాడేవాళ్లు. ఇప్పుడేమో డీజే సౌండ్ ద్వారా అర్థంలేని పాటలు వినిపిస్తున్నాయి. – బందెల భారతి, గౌతమినగర్, మంచిర్యాల

### అప్పటి పాటలే వేరు..



**మంచిర్యాలఅర్బన్:** అప్పట్లో మా ఇంటి(జన్నారం మండలం చింతగూడ) పక్కన బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించే వాళ్లు. 15 రోజుల క్రితం నుంచి బొడ్డెమ్మతో మొదలయ్యేది. అప్పుడే బతుకమ్మ పాటలు పెద్దవాళ్లు పాడుతుంటే చిన్నవాళ్లందరం నేర్చుకునేవాళ్లం. బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతుంటే చుట్టూ అందరూ కూర్చుని వినేవాళ్లు. ఇప్పుడు చప్పట్లకు బదులు డిజే సౌండ్‌లు రావడం చాలా బాధనిపిస్తోంది. ఆరోజులు మళ్లీ వస్తే బాగుండు అనిపిస్తోంది. – సుజాత, గౌతమినగర్, మంచిర్యాల

### సంప్రదాయబద్ధంగా ఆడుతాం



ఎంగిలిపూల నుంచి సద్దుల బతుకమ్మదాకా అందరం సంబురంగా చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ సంతోషంగా ఆడుతాం. ప్రస్తుతం డీజే సౌండ్ సిస్టంతో, ప్రైవేటు పాటలతో బతుకమ్మ ఆడడం బాధాకరం. సంప్రదాయం ప్రకారం చప్పట్లు కొడుతూ బతుకమ్మ ఆడాలి. మా ఊళ్లో తొమ్మిది రోజుల పాటు సంబురాలు జరుపుకుంటాం. నాటి సంప్రదాయాన్ని నిలుపుకునే బాధ్యత నేటితరంపైనే ఉంది. పాటలు పాడుతూ అడుగులో అడుగులు వేస్తూ బతుకమ్మల చుట్టూ తిరగడం అదో తీయని అనుభూతి. – కావేరి, ఆసిఫాబాద్

### అమ్మమ్మవద్ద నేర్చుకున్నా



**కాగజ్‌నగర్‌టౌన్:** మా అమ్మమ్మ తాత బతుకమ్మ పాటలు బాగా పాడేవారు. ఏ పండగైనా, పూజలైనా అక్కడికి చేరి హారతి పాటలు, పెరడి పాటలు పాడేవాళ్ళు. నేనుకూడా వారితో పాటు వెళ్లి పాటలు వింటూ ఉండేదాన్ని. అలా పాటలు నేర్చుకున్నా. ఇటీవల సొంతంగా కొత్త పాటలను కూడా పాడా. పాటలు పాడడం అంటే నాకు చాలా ఇష్టం. – గడమల్ల మౌనిక, భట్టుపల్లి

### తీయని అనుభూతి



**ఆసిఫాబాద్‌అర్బన్:** మా అమ్మ బతుకమ్మ పాటలు పాడేటప్పుడు విని నేర్చుకున్నా. కొన్ని పాటలు పుస్తకంలో చూసి నేర్చుకున్నా. నాకు పాటలు అంటే చాలా ఇష్టం. సుమారు 50 వరకు బతుకమ్మ పాటలు పాడుతా. బతుకమ్మ పండుగకు పాటలు పాడడం చెప్పలేనంత సంతోషాన్ని ఇస్తుంది. పెద్దవారు నేటి తరానికి బతుకమ్మ విశిష్టత, సంప్రదాయాన్ని వివరించాలి. చప్పట్లు కొట్టుకుంటూ బతుకమ్మ ఆడడం ఆదో తీయని అనుభూతి. – రావుల సరోజ, ఆసిఫాబాద్

### పదేళ్ల నుంచి పాడుతున్నా..



**చెన్నూర్:** పదేళ్ల నుంచి బతుకమ్మ పండగకు పాటలు పడుతున్నా. నాకు 20 పాటల వరకు వచ్చు. ప్రతీ సంవత్సరం కొత్తపాట నేర్చుకుని యువతులకు నేర్పిస్తున్నా. బతుకమ్మ అంటేనే గౌరీదేవిని ఆరాధించడం. అమ్మను కొలుస్తూ బతుకమ్మ ఆడుతూ పాటలు పాడుతుంటే మమ్మల్ని మేం మర్చిపోతాం. బతుకమ్మ పాటల్లో మాధుర్యంతో పాటు అంతే ఉత్సాహం ఉంటుంది. – శ్రీరాంభట్ల ప్రవీణ, చెన్నూర్

### పన్నెండు పాటలు వచ్చు



**చెన్నూర్:** పుట్టింట్లో ఉన్నప్పుడు మా అమ్మమ్మ వద్ద బతుకమ్మ పాటలు నేర్చుకున్నా. నాకు పన్నెండు పాటలు వచ్చు. అత్తారింటికి వచ్చినప్పటి నుంచి చెన్నూర్‌లోనే బతుకమ్మ ఆడుతున్నా. పన్నెండు పాటలు నేర్చుకున్నా. సొంతంగా రెండు పాటలు రాసుకుని పాడుతున్నా. మా వాడలో ఇద్దరు పెద్దమ్మలు, నేను మాత్రమే పాటలు పాడుతుంటాం. చాలా సంతోషంగా ఉంటుంది. – వేమారం మీరారాణి, చెన్నూర్

### నాపాటతోనే ప్రారంభిస్తారు



**కోటపల్లి:** నా చిన్నతనంలో మా అమ్మ బతుకమ్మ పాటలు పాడుతుంటే విని నేర్చుకున్నా. ఇప్పుడు నేనుకూడా పాడుతున్నా. ఇటీవలి కాలంలో అందరూ డిజేలు, మైక్‌సెట్ల పాటలతో ఆడుతున్నారు. కానీ గతంలో అందరూ కలిసి మంచిగా పాటలు పాడుతూ బతుకమ్మ ఆడేవాళ్లం. నేను సుమారు పన్నెండు పాటలు పాడుతా. ప్రస్తుతం మా కాలనీలో బతుకమ్మను నా పాటలతోనే ప్రారంభిస్తారు. – బత్తుల కమల, మల్లంపేట

## లంబాడీలను తొలగించే వరకు ఉద్యమిస్తాం

- తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**తలమడుగు:** ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించే వరకు ఉద్యమిస్తామని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. గురువారం రాయి సెంటర్, 9 ఆదివాసీ తెగలు, తుడుందెబ్బ, ఇతర సంఘాల ఆధ్వర్యంలో వేంకటేశ్వర ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మహా పాదయాత్ర నిర్వహించారు. కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకు దెరువు కోసం వలస వచ్చి ఆదివాసీలకు రావాల్సిన అభివృద్ధి ఫలాలను రాకుండా చేస్తున్న లంబాడీలను వెంటనే తొలగించాలన్నారు. అక్రమంగా వలస వచ్చిన వారికి ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయవద్దన్నారు. అనంతరం తహసీల్దార్ రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు జంగాల పోచన్న, డివిజన్ అధ్యక్షుడు కుముర జ్ఞానేశ్వర్, రాయి సెంటర్ అధ్యక్షుడు రామారావు, ఉపాధ్యక్షుడు భుజంగరావు పాల్గొన్నారు.

## గిరి గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- కేంద్ర పరిశీలకుడు జితేంద్ర సింగ్



జితేంద్రసింగ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

**నేరడిగొండ:** గిరిజన గ్రామాల అభివృద్ధే ఆదికర్మ అభియాన్ లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ పరిశీలకుడు జితేంద్రసింగ్ అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో పర్యటించి కార్యక్రమం అమలు తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా లింగట్ల గ్రామ పంచాయతీలోని గోండుగూడలో గుస్సాడీ నృత్యంతో ఆయనకు స్వాగతం పలికారు. లింగట్ల రాజురా, వెంకటపూర్ గ్రామపంచాయతీల్లో కార్యక్రమం అమలు, గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక, గ్రామసభ, గ్రామ సోషల్ మ్యాపింగ్, నిరుద్యోగ యువత గుర్తింపు వంటి అంశాలను పరిశీలించి సంతృప్తి చెందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి వంటి అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. నేరడిగొండ మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమం అమలవుతుందని ఆయన పేర్కొన్నారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి



వైద్యున్ని నిలదీస్తున్న మృతురాలి బంధువులు

**కాగజ్‌నగర్‌టౌన్:** అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజులుగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని సీతానగర్‌కు చెందిన మౌల్‌కార్ అమృత (40) గురువారం రాత్రి మృతి చెందింది. కాగా వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందిందని ఆరోపిస్తూ బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన వైద్యం అందించకపోవడంతోనే ఒక నిండు ప్రాణం బలైందని, దీనికి ఆస్పత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు.

### 'ఓపెన్' పరీక్షలకు 60 మంది గైర్హాజర్

**మంచిర్యాలఅర్బన్:** ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షకు గురువారం మొత్తం 295 మందికి గానూ 235 మంది హాజరుకాగా 60 మంది గైర్హాజరయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఉదయం నిర్వహించిన ఇంటర్ పరీక్షకు 143 మందికి గానూ 113 మంది హాజరుకాగా 30 మంది గైర్హాజరయ్యారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదోతరగతి పరీక్షలకు 97 మందికి గానూ 79 మంది హాజరుకాగా 18 మంది గైర్హాజరయ్యారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 54 మందికి గానూ 43 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదోతరగతి పరీక్షలకు ఒక్కరే పరీక్ష రాయాల్సి ఉండగా గైర్హాజరయ్యారు.

### కొట్టుకుపోయిన సదర్మాట్ గేటు

**ఖానాపూర్:** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అధికారులు ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి దిగువన ఉన్న గోదావరికి ప్రతీరోజు 2 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఖానాపూర్ మండలం మేడంపల్లిలోని సదర్మాట్ వద్ద ఒక గేటు బుధవారం రాత్రి వరద నీటిలో కొట్టుకుపోయింది. అప్రమత్తమైన అధికారులు సదర్మాట్‌తో పాటు గోదావరి పరీవాహకంలోని పలుచోట్ల ఎస్కేప్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం గేటు కొట్టుకుపోయిన ప్రాంతాన్ని ఇరిగేషన్ ఈఈ ప్రవీన్, డీఈ వీరన్న, ఏఈఈ నితిన్ సందర్శించారు. వరద ఉధృతి తగ్గాక గేటు ఏర్పాటు చేస్తామన్నారు. ఖానాపూర్, కడెం మండలాల పరిధిలోని సుమారు 15వేల ఎకరాలకు సాగు నీటిని అందించే సదర్మాట్ కాలువ గేటు పోయిన విషయం తెలియడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పండుగలకు ప్రత్యేక రైలు

**కాగజ్‌నగర్‌టౌన్:** దసరా, దీపావళి పండగల దృష్ట్యా ప్రయాణికుల రద్దీ తీవ్రతను దృష్టిలో ఉంచుకున్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు హజ్రత్ నిజాముద్దీన్–చర్లపల్లి, చర్లపల్లి–హజ్రత్ నిజాముద్దీన్ మధ్య ప్రత్యేక రైలును నడిపించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు చర్లపల్లి నుంచి ప్రతీ మంగళ, గురువారాల్లో, హజ్రత్ నిజాముద్దీన్ నుంచి బుధ, శుక్ర వారాల్లో బయలుదేరుతుందని పేర్కొన్నారు. కాజీపేట్, పెద్దపెల్లి, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగ్‌పూర్, అమ్లా, ఇటార్సి, బోపాల్, బిన, జాన్సీ, అగ్ర, స్టేషన్లలో హాల్టింగ్‌కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ రైలులో 1 ఏసీ, 2ఏసీ, 3 ఏసీ, స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని, ప్రయాణికులు గమనించాలని సూచించారు.

### న్యాయ నిర్ణేతలుగా ఉమ్మడి జిల్లా రెఫరీలు

**ఆసిఫాబాద్:** హైదరాబాద్‌లోని నిజాం కళాశాల ఆవరణలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరుగనున్న 17వ హెచ్‌ఎఫ్‌ఐ మినీ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉమ్మడి జిల్లాకు చెందిన రెఫరీలు సునార్కర్ అరవింద్, దుర్గం రాజలింగు, గోగర్ల రాజశేఖర్, గోగర్ల సాయి ఎంపికైనట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్ రావు తెలిపారు. దేశంలోని అత్యున్నత క్రీడా శిక్షణ సంస్థ అయిన నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ పటియాలలో ఇప్పటికే శిక్షకులుగా శిక్షణ పూర్తి చేసుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## ముంబై ఎయిర్‌పోర్టులో ఆదిలాబాద్ వాసి అరెస్ట్



నిందితుడు షేక్ ఇర్ఫాన్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

**ఆదిలాబాద్‌టౌన్:** టాంజానియా దేశంలో ఉంటూ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన షేక్ ఇర్ఫాన్‌ను ముంబై ఎయిర్‌పోర్టులో అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌రూరల్ పోలీసులు రౌడీషీటర్ కైంచి సలీంను అరెస్ట్ చేసిన ఘటనపై నిందితుడు ఇర్ఫాన్ 'సిల్‌సిలా ఆదిలాబాద్' అనే వాట్సాప్ గ్రూపులో టాంజానియాలో ఉంటూ వివాదాస్పద వాయిస్, టెక్స్ట్ మెసేజ్‌లు పోస్ట్ చేశాడు. దీంతో గత ఏప్రిల్ 15న ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడు విదేశాల్లో ఉండటంతో ఎస్పీ అఖిల్ మహాజన్ సిఫార్సు మేరకు ఇమిగ్రేషన్ అధికారులు అతనిపై లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం టాంజానియా నుంచి ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన షేక్ ఇర్ఫాన్‌ను ఇమిగ్రేషన్ అధికారులు డిటైన్ చేసి ఎయిర్‌పోర్ట్ పోలీసులకు అప్పగించారు. అనంతరం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై పేర్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ముంబైలో అతన్ని పట్టుకొని ఆదిలాబాద్‌కు తరలించినట్లు చెప్పారు. జడ్జి ఎదుట హాజరుపర్చగా 14 రోజుల జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. నిందితుడి వద్ద నుంచి పాస్‌పోర్ట్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## లైన్‌మెన్‌పై మహిళా కార్యదర్శి ఫిర్యాదు

**కోటపల్లి:** మండలంలోని దేవులవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని లైన్‌మెన్ రామకృష్ణపై ఓ మహిళా కార్యదర్శి ఎస్‌ఈకి ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి విద్యుత్ పనుల నిమిత్తం ఎల్‌సీ విషయంలో లైన్‌మెన్ రామకృష్ణకు ఫోన్‌చేసి మాట్లాడారు. ఆ తర్వాత నుంచి మధ్య మధ్యలో ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతూ విసిగిస్తున్నాడని కార్యదర్శి పేర్కొన్నారు. ఈ విషయమై ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఎస్‌ఈ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, సదరు లైన్‌మెన్‌కు యూనియన్ బడా నాయకుడితోపాటు ఏఈ అండదండలు ఉండడంతో తనకేం కాదనే ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో బొప్పారంలో రైతుల నుంచి డబ్బులు డిమాండ్ చేసిన లైన్‌మెన్‌ను సస్పెండ్ చేసి చెన్నూర్ మండలానికి బదిలీ చేశారు. తిరిగి దేవులవాడకు వచ్చినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదని తెలుస్తోంది. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపులో డబ్బులు తీసుకున్నాడని ఆరోపణల నేపథ్యంలో అధికారులు విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఏఈ వెంకటేశ్వర్లును సంప్రదించగా.. ఫిర్యాదును ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

## డిగ్రీ చేసిన డిపెండెంట్లకు క్లర్క్ పోస్టులు



ఒప్పంద పత్రాలతో గుర్తింపు సంఘం నాయకులు

**శ్రీరాంపూర్:** సింగరేణి గని ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగుల స్థానంలో డిగ్రీ చదివిన డిపెండెంట్లకు సూటబుల్ జాబ్ కింద గ్రేడ్ 3 క్లర్క్‌పోస్ట్ ఇవ్వడానికి ఒప్పందం జరిగింది. 2009లో అప్పుడున్న గుర్తింపు సంఘం ఏఐటీయూసీకి, యజమాన్యానికి మధ్య జరిగిన చర్చల్లో గని ప్రమాదాల్లో ఉద్యోగులు చనిపోతే వారి పిల్లలకు విద్యార్హతను బట్టి సూటబుల్ జాబ్ కల్పించాలని ఒప్పందం జరిగింది. కానీ కేవలం ఐటీఐ, బీటెక్ వంటి టెక్నికల్ చదువులు చదివిన వారికి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టెక్నికల్ సూపర్‌వైజర్లుగా సూటబుల్ జాబ్ కల్పిస్తున్నారు. నాన్ టెక్నికల్ చదువులైన డిగ్రీ మరే ఇతర సత్సమాన డిగ్రీ విద్యార్హత ఉన్న డిపెండెంట్లకు మాత్రం అండర్‌గ్రౌండ్‌లో జనరల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పిస్తున్నారు. దీనిపై ప్రస్తుత గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు పలుమార్లు యాజమాన్యంతో చర్చించారు. గురువారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీపీఎం సమక్షంలో యజమాన్యానికి, గుర్తింపు సంఘానికి మధ్య త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఇందులో సమస్యలను పరిష్కరిస్తూ రాతపూర్వక ఒ ప్పందం జరిగింది. ఉద్యోగి గని ప్రమాదంలో మృతి చెందితే డిగ్రీ అర్హత కలిగిన వారి పిలలకు గ్రేడ్ 3 క్లర్క్‌గా ఉద్యో గం కల్పించబోతున్నారని గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉంటే 2009 నుంచి మైన్స్ యాక్సిడెంట్ కేసుల్లో డిపెండెంట్లు డిగ్రీ అర్హత ఉండి జనరల్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేస్తున్న వారికి కూడా గ్రేడ్ 3 క్లర్క్ ఇప్పిస్తామని తెలిపారు.